# చెరువులకు చేప పిల్లలు

- చేప పిల్లల వదిలివేతకు ప్రణాళిక సిద్ధం
- మేడ్చల్ జిల్లాలో 233 చెరువుల గుర్తింపు
- 63 లక్షల చేప పిల్లల పంపిణీ లక్ష్యం
- బీఆర్ఎస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో మత్స్యకారుల అభివృద్ధికి బీజం

మేడ్చల్, మార్చి 12(నమస్తే తెలంగాణ): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాది పలు చెరువులలో చేప పిల్లల వదిలివేతకు జిల్లా మత్స్య శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. 63 లక్షల చేప పిల్లలను జిల్లా వ్యాప్తంగా వదిలేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. చేప పిల్లల వదిలివేతకు జిల్లాలో 233 చెరువులను గుర్తించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి వంద శాతం సబ్సిడీపై చెరువులలో చేప పిల్లలను విడుదల చేసే పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతి యేట చెరువులు నిండిన తర్వాత మత్స్య శాఖ చేప పిల్లలను వదిలివేస్తుంది. మత్స్యశాఖ పరిధిలోని పలు చెరువులను స్థానిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు మత్స్య శాఖ కౌలుకు ఇస్తుంది. చెరువులలో చేప పిల్లల వదిలివేయడం వల్ల మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతో సహకరిస్తుంది.



### జిల్లాలో 80 మత్స్య పారిశ్రామిక సంఘాలు

జిల్లాలో 80 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలున్నాయి. సహకార సంఘాలలో 3,474 సభ్యులున్నారు. మహిళ 13 పారిశ్రామిక సహకార సంఘాలకు గాను 700 మంది మహిళా సభ్యులు ఉన్నారు. పారిశ్రామిక సహకార సంఘాలలో సభ్యత్వం ఉన్న మత్స్యకారులకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అవసరమయ్యే వివిధ రకాల పరికరాలను సబ్సిడీపై అందించింది. ఇప్పటి ప్రభుత్వమే సబ్సిడీపై పరికరాలను అందిస్తుందా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. మహిళ మత్స్య పారిశ్రామిక సంఘాలకు చెందిన మహిళలు చేపలు అమ్ముకోవడం, రంగు చేపల ఉత్పత్తి, చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చెందుతున్నారు. సంచార మత్స్య విక్రయ వాహనాలు 60 శాతం సబ్సిడీపై అందించారు. గత యేడు 333 చెరువులలో 68 లక్షల చేప పిల్లలను వదలగా ఈ యేడు 63 లక్షల చేప పిల్లలను మాత్రమే 233 చెరువులలో విడుదల చేయనున్నారు.

## ప్రొ. ఏవీ రాజశేఖర్‌కు అరుదైన అవకాశం


ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 12: ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ అరుదైన ఘనతను దక్కించుకున్నారు. కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు శాఖ ఏర్పాటు చేసిన తెలంగాణ స్టేట్ లెవెల్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ సభ్యుడిగా ప్రొఫెసర్ రాజశేఖర్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం రాజపత్రం విడుదల చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. జగిత్యాలకు చెందిన పద్మశాలి కుటుంబంలో జన్మించిన రాజశేఖర్ ఓయూలోనే చదువుకుని అక్కడే అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. ప్రస్తుతం ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన ఆయన శాతవాహన యూనివర్సిటీ జువాలజీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో ఓయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్, ఓయూ అకాడమిక్ ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్, నిజాం కళాశాల జువాలజీ విభాగం హెడ్‌గా సేవలందించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

## పార్లమెంట్ ఎన్నికల ముందే కులగణన జరగాలి



కాచిగూడ, మార్చి 12: పార్లమెంట్ ఎన్నికల ముందే కులగణన నిర్వహించి, నిజాయితీని నిరూపించుకోవాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. కాచిగూడలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే లోక్‌సభ ఎన్నికలకు ముందే కులగణన, విధి విధానాలను ఖరారు చేసి ఉత్తర్వులను జారీ చేయాలని సూచించారు. కులగణనపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసినప్పటికీ ప్రభుత్వం నిర్దిష్టమైన ఉత్తర్వులను జారీ చేయకపోవడంతో బీసీ సంఘాలు నిరాశకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ దళ్ నేతలు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధి మోదీతోనే సాధ్యం

- పదేళ్ల కాలంలో అవినీతిని అంతం చేశాం
- సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో హోం మంత్రి అమిత్ షా

కంటోన్మెంట్, మార్చి 12: తెలంగాణ అభివృద్ధి చెందాలంటే మోదీతోనే సాధ్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో హోం మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో అవినీతిని అంతం చేసినట్లు తెలిపారు. దేశం సురక్షితంగా ఉండాలంటే మూడోసారి మోదీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సోషల్ మీడియా కార్యకర్త నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని కోరారు. ఐదొందల ఏళ్ల కల నెరవేర్చిన ఘనత మోదీ సర్కార్ కే దక్కిందన్నారు. గతంలో కాంగ్రెస్ సర్కార్ చేయని పనిని ప్రధాని చేసి చూపించారని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు చేసిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దానిని రాజకీయం మాత్రమే చేసిందన్నారు. రాహుల్ బాబా విశ్రాంతి కోసం విదేశాలకు వెళ్లతాడని మండిపడ్డారు. సర్జికల్ స్ట్రైక్ చేసి ఉగ్రవాదం భరతం పట్టినట్లు తెలిపారు. ఇండియా అలయన్స్ ఎన్ని ప్రయత్నాలు చేసినా బీజేపీ గెలుపును ఎవరు ఆపలేరన్నారు. 400 స్థానాల్లో 12 కంటే ఎక్కువ స్థానాలను తెలంగాణ నుంచి గెలుపొందాలని పిలుపునిచ్చారు. ట్రిపుల్ తలాక్ తీసేసిన వ్యక్తి మోదీ అన్నారు. మహిళ రిజర్వేషన్, సీఏఏ నిర్ణయాలు చారిత్రాత్మకమన్నారు. అయితే, సీఏఏని కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో అనేక కుంభకోణాలు జరిగాయని, వాటి పై సీఎం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటెల రాజేందర్, కంటోన్మెంట్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, కార్పొరేటర్ దీపిక తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా

## ఉగాది పంచాంగం ఆవిష్కరణ..



జూబ్లీహిల్స్, మార్చి 12: శ్రీమదనానంద ధార్మిక సేవా పరిషత్ ప్రచురించిన క్రోధి నామ సంవత్సర ఉగాది పంచాంగం ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం నేరేడ్‌మెట్ ఎక్స్ రోడ్‌లోని వరసిద్ధి వినాయక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు మృత్యుంజయ శర్మ, ఫౌండర్ నటరాజ శర్మ, సతీష్ చంద్ర, దేవాలయ ప్రతినిధి సుబ్బారాయుడు, పరిషత్ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో డయాలసిస్ కేంద్రం ప్రారంభం

బొల్లారం, మార్చి 12: కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు బొల్లారం సర్దార్ వల్లభాయి పటేల్ కంటోన్మెంట్ దవాఖానలో మంగళవారం జైన సంఘం ఆధ్వర్యంలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు సోమ శంకర్, సీఈఓ మధుకర్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బోర్డు అధ్యక్షుడు సోమ శంకర్ మాట్లాడుతూ, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తుల నిమిత్తం జైన సంఘం సొంత నిధులతో డయాలిసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కంటోన్మెంట్ వ్యాప్తంగా ఉన్న డయాలిసిస్ రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ రామక్రిష్ణ, జైన సంఘం ప్రతినిధులు ఉజ్వల్ జైన్, గౌతమ్ జైన్, సోహన్ లాల్, వినోద్, బోర్డు ఇంజనీరింగ్ అధికారులు బాలకృష్ణ, వైద్య సిబ్బంది సత్యశీల్, బాలరాజు పాల్గొన్నారు.



## మౌలాలి దర్గా పనులను వెంటనే పూర్తి చేయాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్


మౌలాలి గుట్టపై అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రొనాల్డ్ రాస్, చిత్రంలో తదితరులు

సిటీబ్యూరో, మార్చి 12(నమస్తే తెలంగాణ): మౌలాలి దర్గాలో భక్తుల సౌకర్యార్థం చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. కమిషనర్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హాసన్‌తో పాటు ప్రాజెక్టు సీఈ దేవానంద్, ఎస్ఈ రవీందర్ రాజు, జోనల్ కమిషనర్లతో మంగళవారం కలిసి కమిషనర్ దర్గా అభివృద్ధి పనులను పరిశీలించారు. జీహెచ్ఎంసీ ద్వారా దర్గా అభివృద్ధి పనులను రెండు దశల్లో చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. దర్గాకు వచ్చే భక్తుల దర్శనానికి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు మొదటి దశలో చేపట్టిన రిటైనింగ్ వాల్‌తో పాటు రోడ్డు, మిడిల్ ల్యాండింగ్ వాహనాలను నిలిపేందుకు 1000 చదరపు మీటర్ల పార్కింగ్ పూర్తి చేశామని, రెండో దశలో రిటైనింగ్ వాల్‌తో పాటుగా రోడ్డు నిర్మాణానికి పనులు చేపట్టినట్లు , పనులు 50 శాతం పూర్తయ్యాయని, మిగతా 50 శాతం అసంపూర్తి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. కాంట్రాక్టర్ సగం పనులు చేసి నిలిపివేశారని నిర్వాహకులు కమిషనర్‌కు తెలియజేశారు. అసంపూర్తి పనులను వెంటనే పూర్తి చేయించాలని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు.

### రెండో ర్యాంప్ నిర్మాణానికి సన్నాహాలు

మల్కాజిగిరి: మౌలాలి గుట్టపై రెండో ర్యాంప్ నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. గుట్టపై ర్యాంప్ నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ రొనాల్ రాస్‌తో పాటు ఇంజనీరింగ్ విభాలకు సంబంధించిన అధికారులు పరిశీలించారు.

## తాగునీటికి సరిపడా నీరు!

- జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు
- అదనపు జలాలకు ఎమర్జెన్సీ పంపింగ్ ఏర్పాట్లు
- ప్రజలెవరు ఆందోళనకు గురి కావొద్దు: జల మండలి

సిటీబ్యూరో, మార్చి 12(నమస్తే తెలంగాణ): ఈ వేసవిలో హైదరాబాద్ మహా నగర ప్రజల తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయని, అందువల్ల నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉండబోవని జల మండలి స్పష్టం చేస్తోంది. ప్రధాన జలాశయాలైన నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని స్పష్టం చేశారు. నాగార్జున సాగర్ జలాశయం అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి కృష్ణా మూడు దశల్లో రోజూ 270 ఎంజీడీల నీటిని తరలిస్తున్నదని, ఈ లెక్కన నెలకు 1.38 టీఎంసీల నీటిని సరఫరా చేస్తున్నదన్నారు. మంగళవారం నాటికి సాగర్ నీటి నిల్వ 514.10 అడుగుల మేర ఉన్నదని, ప్రస్తుతం రిజర్వాయర్‌లో డెడ్ స్టోరేజీ లెవల్ పైన 7.60 టీఎంసీల నీటి లభ్యత ఉన్నదన్నారు. ఈ వేసవిలో హైదరాబాద్ నగరానికి తాగునీటి కొరత ఉండదని అధికారులు తెలిపారు. మరోవైపు గోదావరి జలాల కోసం ఎల్లంపల్లి జలాశయంలో డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తరలించేందుకు అత్యవసర పంపింగ్ చేయడానికి అవసరమైన ప్రక్రియ మొదలు పెట్టిందని అధికారులు పేర్కొన్నారు. దీంతో పాటు అవసరాన్ని బట్టి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల నుంచి అదనపు జలాలను తరలించేందుకు సమాయత్తమవుతోందని చెప్పారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో సంతృప్తికరమైన నీటి నిల్వలు ఉన్నాయని, తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. నగర ప్రజలు ఎలాంటి ఆందోళనలకు గురి కావొద్దని జల మండలి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది.

## రైతులకు అండగా ఉంటాం

- వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహాలు రైతులు పాటించాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు


వర్చువల్ పద్ధతిలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 12: రైతులు ఎట్టి పరిస్థితులలో దిగులు చెందవద్దని, తమకు అండగా ఉంటామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డితో మంగళవారం కలిసి ఆయన రాజేంద్రనగర్ ప్రొ.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్ విభాగంలో వర్చువల్ పద్ధతిన సలహాలు, సూచనలు ఇవ్వనున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందించిన పరిశోధనలు రైతులకు క్షేత్ర స్థాయిలో అందించి రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత అధికారులపై, శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ప్రభుత్వ ఆశయాలను లక్ష్యాలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షులు డా. జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ నేటి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న పరిశోధనా ఫలితాలను ఈ కార్యక్రమం ద్వారా రైతులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సంచాలకులు డా. గోపి, పండ్ల పరిశోధనా సంస్థ, సంగారెడ్డి సీనియర్ శాస్త్రవేత్త , అధిపతి డా. వి.సుచిత్ర, జి.శ్రీనివాస్, సమగ్ర వ్యవసాయ పరిశోధనా విభాగం సీనియర్ శాస్త్రవేత్త, డా.ప్రగతి కుమారి, రిజిస్ట్రార్ డా.వెంకటరమణ, పరిశోధనా సంచాలకులు డా. పి.రఘురామి రెడ్డి, విస్తరణ సంచాలకులు డా. వి.సుధారాణి, డా,.శ్రీనివాసులు, రాష్ట్ర వ్యయసాయ శాఖ డైరెక్టర్ గోపి, ఐఐఆర్ డైరెక్టర్ సుందరం, రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి.కృపాకర్ రెడ్డి, అధ్యక్షులు వైద్యనాథ్ ప్రధాన కార్యదర్శి కృపాకర్ రెడ్డి, డా.విద్యాసాగర్ పాల్గొన్నారు.

## నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి

సీఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు శివరాం


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శివరాం

రవీంద్రభారతి, మార్చి 12: రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పాలనను తక్షణమే రద్దు చేసి ఫోరంలో డిపాజిట్ చేసిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని సీఎఫ్ఐ (కన్జ్యూమర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లు శివరాం డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎఫ్ఐ జాతీయ సలహాదారుడు గొల్లపల్లి దయానంద్‌తో కలిసి శివరాం మాట్లాడారు. కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్లు అన్నీ రిజిస్ట్రార్ పేరుతో వెలువడుతున్నాయని, అందులో భాగంగా 2022 ఆగస్టులో ఇద్దరు సభ్యుల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. అందుకు వివిధ రంగాలలో అనుభవం కలిగిన వారితో పాటు న్యాయవాద వృత్తిలో 15 ఏళ్ళ అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చునని నోటిఫికేషన్‌లో వెల్లడించారని చెప్పారు. నోటిఫికేషన్ జారీ సమయంలో నియమాలపై జాగ్రత్తలు తీసుకోకుండా నోటిఫికేషన్ ఇచ్చిన ఇన్చార్జి రిజిస్ట్రార్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఇన్చార్జి రిజిస్ట్రార్‌ను మార్చి పూర్తి స్థాయి రిజిస్ట్రార్‌ను ఏర్పాటు చేయాలని వినియోగదారుల రాష్ట్ర కమిషన్ కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డి.శారద, ఉపాధ్యక్షుడు కూరపాటి మధు, ఏపీ అధ్యక్షుడు కె.జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పలు కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడగించినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫీజును ఈ నెల 16వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించవచ్చన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చని తెలియజేశారు. అన్ని ఫ్యాకల్టీల పీహెచ్‌డీ కోర్స్ వర్క్ (ప్రీ పీహెచ్‌డీ) పరీక్షా ఫీజును ఈ నెల 23వ తేదీ లోగా సంబంధిత డీన్ కార్యాలయాల్లో చెల్లించాలని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

### పలు కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల

ఓయూ పరిధిలోని పలు కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎంఈ, ఎంటెక్ కోర్సుల రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, మూడో సెమిస్టర్ మేకప్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ ఉద్యోగుల నిరసన ప్రదర్శన



అమీర్‌పేట్, మార్చి 12: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశ పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని అంగన్‌వాడీ ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు. తమను దొంగలుగా చిత్రీకరిస్తూ పోషకాహారం దుర్వినియోగం కాకుండా చూస్తామంటూ ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లకు పూనుకోవడం సరికాదన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేస్తుండటాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఐసీడీఎస్ డైరెక్టర్ కాంతి వెస్లీతో మంగళవారం జరిగిన చర్చల్లో అంగన్‌వాడీ ప్రతినిధులు సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు జి.కవిత, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీత, శోభల ఆధ్వర్యంలో మంగళవారం ఐసీడీఎస్ డైరెక్టర్ కార్యాలయం నుంచి అమీర్‌పేట్ మైత్రివనం చౌరస్తా వరకు భారీ ర్యాలీతో తరలి వచ్చారు.

## ఇన్‌ఫెక్షన్ నివారణలపై నర్సులకు అవగాహన అవసరం

గాంధీ దవాఖాన సూపరింటెండెంట్, అదనపు డీఎంఈ డాక్టర్ ఎం.రాజారావు



అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎం.రాజారావు

బన్సీలాల్‌పేట్, మార్చి 12: దవాఖానలో రోగులు త్వరగా కోలుకోవడానికి ఇన్‌ఫెక్షన్ నివారణ చర్యలు ఎంతో దోహదపడతాయని గాంధీ దవాఖాన సూపరింటెండెంట్, అదనపు డీఎంఈ డాక్టర్ ఎం.రాజారావు అన్నారు. బోయిగూడలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సికింద్రాబాద్‌లో కంటిన్యూడ్ నర్సింగ్ ఎడ్యుకేషన్-4లో భాగంగా ఏడు రోజుల పాటు జరిగే 'ఇన్‌ఫెక్షన్ నివారణ - నియంత్రణ చర్యలు' అనే అంశంపై అవగాహన శిబిరాన్ని మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ (నర్సింగ్) శాఖ, న్యూఢిల్లీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో నగరంలోని గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఫీవర్, ఛాతి, క్యాన్సర్, జిల్లా, ఏరియా దవాఖానలకు చెందిన నర్సింగ్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా జాగ్రతలను తీసుకోవాలని ఆయన సూచించారు. కరోనా కీలక దశలో గాంధీ దవాఖానలో అత్యధిక ఇన్‌ఫెక్షన్ కలిగి ఉండేదని, తమ వైద్యులు, సిబ్బంది చేపట్టిన చర్యల వలన సత్ఫలితాలు వచ్చాయని తెలిపారు. వాటి అనుభవాలతో ఇన్‌ఫెక్షన్ నియంత్రణ, నివారణ చర్యలపై ప్రత్యేకంగా గైడ్‌లైన్స్ పుస్తకాన్ని రూపొందించడం జరిగిందని, ఇది ప్రస్తుతం తెలంగాణాలోని అన్ని దవాఖానలలో వాడుతున్నారని, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నర్సింగ్ ఆఫీసర్ల విధి నిర్వహణలో ఎంతో ముఖ్యమైన ఈ అంశంపై అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. గాంధీ దవాఖాన ఆర్ఎంఓ డాక్టర్ జయకృష్ణ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, సికింద్రాబాద్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.విద్యుల్లత అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో ప్రొఫెసర్ రేణుకాదేవి, అధ్యాపకులు ఎం.విజయలక్ష్మి, పి.భాగ్యలక్ష్మి, పి.చరిత, ఎం.వనజ, వి.మధుర, ఎం.మంజుల పాల్గొన్నారు.

## ఎంఎన్‌వోలకు అదనపు హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలి

బీఎంఎస్ యూనియన్ డిమాండ్


ఉస్మానియా సూపరింటెండెంట్ డా. నాగేందర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న గొల్లపల్లి అనిల్ కుమార్

సుల్తాన్ బజార్, మార్చి 12: దవాఖానలలో రోగులకు సమానంగా సేవలందిస్తున్న ఎంఎన్‌వో (మేల్ నర్సింగ్ ఆర్డర్‌లైస్), ఎఫ్ఎన్‌వో(ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్‌లైస్)లలో ఎఫ్ఎన్‌వోలకు మాత్రమే అడిషనల్ హెచ్‌ఆర్‌ఏ ఇచ్చి లింగ వివక్షత చూపడం సమంజసం కాదని బీఎంఎస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లపల్లి అనిల్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్‌కు అనిల్ కుమార్ యూనియన్ సభ్యులతో మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జీవో ఎంఎస్ నం.386, జీవో ఆర్‌టీ నం.19 మెడికల్ అండ్ హెల్త్(కె)డిపార్ట్‌మెంట్ ప్రకారం, ఎంఎన్‌వోలకు అడిషనల్ హెచ్‌ఆర్‌ఏ ఇవ్వాలని, అందుకు ప్రత్యేక జీవోలు ఉన్నాయని అన్నారు. గత రివైజ్డ్ పే స్కేల్స్ జీవోలో మాత్రం ఎఫ్ఎన్‌వో పేరు మాత్రమే ఉన్నదని, ఎంఎన్‌వోల పేరు లేనందున అడిషనల్ హెచ్‌ఆర్‌ఏ ఇవ్వడం లేదని, దానిని నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడ మగ తేడా తప్ప ఇద్దరు చేసేది ఒక్కటే పని భావించి ఎంఎన్‌వోలకు అడిషనల్ హెచ్‌ఆర్‌ఏ ఇప్పించాలని సూపరింటెండెంట్‌ను ఆయన కోరారు. గత 32 ఏండ్లుగా ఎంఎన్‌వోలకు అదనపు హెచ్‌ఆర్‌ఏలను రాష్ట్ర వ్యాప్తంగా నిలుపుదల చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు ఎం.నరేందర్, జీపీ క్రిష్ణ, జంగేశ్వర్, రాజు, ప్రేమ్ పాల్గొన్నారు.

## సీసీఎంబీఎఫ్ డే సందర్భంగా స్టూడెంట్ టాక్

సిటీబ్యూరో, మార్చి 12(నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్ బయాలజీ ఫౌండర్స్ డే వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం స్టూడెంట్ టాక్ నిర్వహించారు. పారాసైట్ ఇన్ ఫుడ్ వెబ్స్, పరిశోధనల్లో వాస్తవికత అంశాలపై నిపుణులు ప్రసంగించారు. ఈ సందర్భంగా శాస్త్ర, సాంకేతిక రంగంపై విద్యార్థులకు ఆసక్తిని పెంచడంతో పాటు, వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా స్టూడెంట్ టాక్ నిర్వహిస్తున్నట్లుగా సీసీఎంబీ వర్గాలు వెల్లడించాయి.

## నేడు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అండ్ ఆల్టర్నేటివ్ మెటీరియల్స్‌పై అవగాహన

జూబ్లీహిల్స్, మార్చి 12: ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలపై అవగాహన కల్పించేందుకు నిమ్స్‌మే, పీసీబీ సంయుక్తంగా కార్యాచరణ చేపడుతున్నారు. ఈ మేరకు యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మేలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అండ్ ఆల్టర్నేటివ్ మెటీరియల్స్' అన్న అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు వర్క్ షాప్ డైరెక్టర్ జె.కోటేశ్వర రావు తెలిపారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మే క్యాంపస్‌లో ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:30 వరకు సదస్సు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో పాల్గొనే ఆసక్తి ఉన్నవారు https://www.nimsme.org/surl/1aos లింక్‌లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నం. 81062 56066/ 81255 44429/ 040-23633241.

## మున్నూరు కాపు సంఘ భవనానికి రూ.20 కోట్లు కేటాయించాలి

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

శంషాబాద్ రూరల్, మార్చి 12: మున్నూరు కాపులకు జనాభా ప్రకారం నిధులు కేటాయించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శంషాబాద్ పట్టణంలో రంగారెడ్డి జిల్లా మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గాదె రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య మాట్లాడుతూ మున్నూరు కాపులకు జనాభా ప్రకారం నిధులు కేటాయించి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మున్నూరు కాపు సంఘానికి ఆత్మగౌరవ భవన నిర్మాణం చేయడంతో పాటు రూ.20 కోట్లు కేటాయించాలని కోరారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మున్నూరు కాపులకు రాజ్యసభలో, ఎమ్మెల్సీలుగా నామినేట్ పోస్టులు ఇవ్వాలన్నారు. తెలంగాణలో మున్నూరు కాపులు వెనుకడి ఉన్నట్లు తెలిపారు. వారిని ఆదుకోవడం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమాలు త్వరలో చేపడుతామని తెలిపారు. 33 జిల్లాలలో ప్రతి జిల్లా కేంద్రంలో ప్రతి జిల్లాకు రెండు ఎకరాల భూమితో పాటు హాస్టల్ భవనాల నిర్మాణాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షుడు ఆవుల శ్రావణ్ పటేల్, భూనూరి శివశంకర్, లింగమయ్య,జుర్కి రమేష్‌లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కొండ దేవయ్య, చిత్రంలో తదితరులు